క్లుప్తంగా

నేడు అమరవీరుల స్తూపం వద్ద సంఘీభావ ప్రదర్శన

ఐనవోలు: ప్రభుత్వ దమన నీతికి నిరసనగా టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో హనుమకొండ అమరవీరుల స్తూపం వద్ద శనివారం సంఘీభావ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చుంచుకాల లింగారావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి శనివారం దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఎమ్మెల్సీ ఒక్కరే దీక్ష చేయాలని, 50 మందికి మించి సంఘీభావం తెలపడానికి రాకూడదని రాష్ట్ర ప్రభుత్వం షరతులు విధించడం ప్రభుత్వ దమన నీతికి నిదర్శనం అని తెలిపారు. అందుకు నిరసనగా జిల్లా కేంద్రంలో చేపడుతున్న సంఘీభావ ప్రదర్శనలో జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీజేపీ మండల కార్యదర్శిగా 'పైడి'


బయ్య పైడి

ఆత్మకూరు: బీజేపీ మండల కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బయ్య పైడిని నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పైడి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందంకు పైడి కృతజ్ఞతలు తెలిపారు.

బీటీ పత్తి విత్తనాల ధరలు తగ్గించాలి

ఐనవోలు: పెరిగిన బీటీ పత్తి విత్తనాల ధరలు తగ్గించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. విత్తనాల ప్యాకెట్ ధర అదనంగా రూ.43లు పెంచడంతో రైతులపై భారం పడుతోందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో రైతులపై సుమారు రూ4.3 కోట్ల అదనపు భారం పడనుందని వివరించారు. అలాగే, జిల్లాలో నకిలీ బీటీ, నాసిరకం విత్తనాలు వచ్చే అవకాశం ఉందని, ఈక్రమంలో వ్యవసాయ, పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విత్తన దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు.

ఎన్‌యూజే నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా రాజన్న



వరంగల్: నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ – ఇండియా (ఎన్‌యూజే (ఐ)) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ప్రింట్ మీడియాలో జర్నలిస్టుగా పనిచేస్తున్న చెందిన పోతరవేని రాజన్న నియామకమయ్యారు. ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలోని జజ్పూర్ నగరంలో నిర్వహించిన ఎన్‌యూజే(ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఈ నిర్ణయం తీసున్నట్లు యూనియన్ నేషనల్ సెక్రటరీ జనరల్ సురేష్ శర్మ పేర్కొన్నారు.

నేడు దివ్యాంగుల ప్రజావాణి

హన్మకొండ: దివ్యాంగుల ప్రజావాణిని ఈనెల 27న నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి (ఇన్‌చార్జ్) కె.మధురిమ తెలిపారు. హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 11గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు

రామన్నపేట: చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. గోపాల స్వామి గుడి తోటమైదానంలో చేనేత కార్మికులకు రూ.5 లక్షల బీమా బాండ్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత వృత్తిని కొనసాగించే నేతలన్నలకు సరిపడా పనిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో చేనేతలకు సబ్సిడీ నెలనెలా ఖాతాల్లో నేరుగా పడే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మరావు, పంతగాని శ్రీనివాస్, కొలిపాక మధునయ్య, చిన్నభద్రయ్య, కుమార స్వామి, రవిరాజు, కిరణ్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల అందజేత

హన్మకొండ చౌరస్తా: అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి ఆధ్వర్యంలో మంచికంటి పద్మజ, డాక్టర్ రవీంద్ర సహకారంతో కాకాజీకాలనీలోని తేజ కంటి ఆస్పత్రిలో రజిత, మానసకు కుట్టు మిషన్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబానికి చేదోడుగా ఉంటారని అన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

- రోడ్డుపై గుంత.. ఏర్పాటు చేయని హెచ్చరిక బోర్డు
- పైపులైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలేసిన వైనం


పైపులైన్‌మరమ్మతు కోసం తీసిన గుంత

శాయంపేట: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పైపులైన్ లీకేజీ కావడంతో కొత్తగా వేసిన సీసీ రోడ్డును తవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. పనిపూర్తి చేసి వారం గడుస్తున్నా ప్రమాదకరంగా ఉన్న గుంత వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దాంతో వాహనదారులు ఆదమరిచి వెళ్తే ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పైపులైన్ లీకేజీ కావడంతో ములుగు నుంచి సిబ్బందిని రప్పించి సీసీ రోడ్డు తవ్వి పైపులైను పనులను స్థానిక జీపీ సిబ్బంది చేయించారు. అయితే పనిపూర్తై వారం గడుస్తున్నా ఆ గుంతను అలాగే వదిలేశారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ పోతు సుమలతను వివరణ కోరగా, పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేశామని తెలిపారు. పెద్ద పైపులు కావడంతో నీటి సరఫరా ప్రారంభించాక లీకేజీ లేకుంటే గుంతను పూడ్చివేస్తామని ఆమె వివరణ ఇచ్చారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని బీజేపీ ఆలేరు పాలక్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పిలుపునిచ్చారు. పరకాల బీజేపీ కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మొలుగూరి భిక్షపతి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, మోసపూరిత పాలనను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారం దక్కించుకునేలా కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం అసెంబ్లీ ప్రభారి దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీర్, పట్టణ నాయకులు బాసాని సోమరాజ్, గాజుల నిరంజన్, కుక్కల విజయ్, మంతెన సంతోష్, సంఘ పురుషోత్తం, దుబాసి వెంకటస్వామి, పాలకుర్తి తిరుపతి, పిట్ట వీరస్వామి, దార్న నారాయణదాసు, భాస్కరాచారి పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ


అభిరానందన్ పి.యశ్వంత్ కే.అభిలాష్


ఎం.యశ్వంత్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. డి.అభిరానందన్ 71వ ర్యాంక్ సాధించగా, పి.యశ్వంత్ 236, కె.అభిలాష్ 615, ఎం.యశ్వంత్ 1071 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ మోతె రాజ్‌కుమార్ తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

పరకాల పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం..


పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అనిత

పరకాల: పలు అభివృద్ధి పనులతో పరకాలను జిల్లాలో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దనున్నట్లు పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత తెలిపారు. 14వ వార్డులో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరకాల పట్టణాన్ని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకువస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ చౌరస్తా: భారత ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులకు జిల్లాలోని వివిధ రంగాల్లో సేవలందించిన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, ఆటలు, సంఘసేవ, విద్య, వైద్య, విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక, పరిశ్రమలు, వ్యాపార తదితర రంగాల్లో విశిష్టమైన సేవలందించిన వారికి పద్మ అవార్డులను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు https://www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందులో ప్రెస్‌క్లిప్స్, ఫొటోలతో సహా పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వీటి కాపీలు నాలుగు సెట్లు ఈ నెల 28వ తేదీన హనుమకొండలోని కేడీసీ ఎదురుగా ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తారని పేర్కొన్నారు.

క్రీడాకారులకు ట్రాక్ సూట్ అందజేత


ఎస్సైకి కప్ అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

ధర్మసాగర్ (వేలేరు): సీఎం కప్ కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన కబడ్డీ క్రీడాకారులకు వేలేరు సర్పంచ్ కాయిత మాధవరెడ్డి శుక్రవారం ట్రాక్ సూట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని ప్రశంసించారు. ఇలాగే, క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం, వేలేరు ఎస్సై హరితను కలిసి సీఎం కప్ బహుమతిని వేలేరు పోలీస్ స్టేషన్‌కు అందజేశారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి, వేలేరు ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, భాస్కర్, వినయ్, ప్రవీణ్, అభిరామ్, సాయి, విష్ణు, అఖిల్, విక్రమ్, శ్రీశైలం పాల్గొన్నారు.

తప్పుడు కాగితాలతో ప్లాట్ల విక్రయం

కాజీపేట: ఇంటి నివేశన స్థలాలను కాజేసి ఇబ్బందులకు గురి చేస్తున్న కబ్జాదారుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కటకం కిషన్ అనే రిటైర్డ్ ఉపాధ్యాయుడికి చెందిన రెండు ప్లాట్లను కటకం సంతోష్ అనే వ్యక్తి తప్పుడు కాగితాలు సృష్టించి ఇతరులకు విక్రయించినట్లుగా నిర్ధారణ కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఆత్మకూరులో కొమురమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతిచెందిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన రేవూరి కొమురారెడ్డి, నాగెల్లి నర్సమ్మ, బరుపట ఈశ్వరమ్మ, మంతుర్తి కొమురమ్మ, అగ్రంపహాడ్‌లో మృతిచెందిన తోట రజనీకాంత్, గుల్లపెల్లి పద్మ, బోరిగం గణేష్, ఐలమ్మ కుటుంబాలను నాయకులు ఓదార్చి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పర్వతగిరి రాజు, కిరీటి, ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, అలువాల రవి పాల్గొన్నారు.

నిబంధనలను పట్టించుకోని 'ఏకశిల'



హన్మకొండ: కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు.. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోని ఏకశిల విద్యాసంస్థల కొమ్ము కాస్తున్నారని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను పట్టించుకోకుండా ఏకశిల విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపుల పేరుతో తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నిబంధనలను తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్న ఏకశిల విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై హనుమకొండ కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు పగిడిపల్లి పవన్ గౌడ్, భగత్, రమేష్, జగన్, వెంకటేష్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో యువత పాత్ర కీలకం


నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

ధర్మసాగర్: రాబోయే సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గంలో యువత పాత్ర కీలకమని జనసేన పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గాదె పృథ్వీ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధి కాజీపేట మండలంలోని రాంపూర్ గ్రామంలో జనసైనికులతో కలిసి శుక్రవారం ర్యాలీ తీస్తూ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత.. రాజకీయాల్లో ఉంటే అవినీతికి అడ్డుకట్టు వేయవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో అవినీతి పేరుకుపోయిందని ఎద్దేవా చేశారు. యువతకు ఉపాధి కల్పనలో పాలకులు విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. యువతను ఏకంచేసి ఎన్నికల్లో జనసేన సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తరుణ్, వివేక్, అర్జున్, మౌనిత్, చందు, అఖిల్, కార్తీక్, శశి, రక్షిత్, అజయ్, ప్రేమ్, సందీప్, మహమ్మద్, రజాక్, మునిగాల పవన్, తదితరులు పాల్గొన్నారు.

4న కొత్తగూడెంలో సీపీఐ ప్రజాగర్జన


ప్రజాగర్జన సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: జూన్ 4న కొత్తగూడెంలో లక్ష మందితో సీపీఐ ప్రజాగర్జన పేరిట బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియాతో కలిసి ప్రజాగర్జన వాల్‌పోస్టర్ల శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ పోటీకి సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని వివరించారు. బహిరంగ సభకు వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో గన్నారపు రమేష్, ఎలేందర్, ల్యాదెల్ల శరత్, రవి, అక్బర్, చందు, యాకూబ్, రాజేందర్, యాకూబ్, రమేష్, నరేష్, కళాకారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ

దామెర: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని నిర్వాహకులను తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్ హెచ్చరించారు. మండలంలోని సింగరాజుపల్లి, పసరగొండలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాహకులతో తహసీల్దార్ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పసరగొండ కేంద్రంలో 7బస్తాలు నిల్వ ఉండగా వాటిని పరిశీలించారు. కాగా, వాటిలో ఎక్కువ తాలు ఉండని ఎలా కాంటా వేస్తారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు బస్తాలను రైతులకు తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. సింగరాజుపల్లి కేంద్రానికి మూడు లారీలు అవసరం కాగా, లారీలను రప్పించి ధాన్యాన్ని మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ముత్యం రాజేందర్, ఏపీఎం ఝాన్సీ, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి రాజు, రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దామెర: ఈనెల 28న ములుగులో నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐయూఎస్ఐ జిల్లా కార్యదర్శి, దళిత బహుజన కూలీ రైతు సమాఖ్య రాష్ట్ర కోఆర్డినేటర్ దామెర మొగిలి పిలుపునిచ్చారు. ఈమేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణచివేత, దోపిడీ, ఆధిపత్య విధానాల నుంచి దళిత, బహుజన, పీడిత ప్రజల విముక్తి కోసం తమ నెత్తురు ధారపోసిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈనెల 31 వరకు నిర్వహించనున్న అమరుల సంస్మరణ సభల్లో భాగంగా ములుగులో నిర్వహించే సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్, బీడీఎస్ఎఫ్ నాయకులు గడ్డం ప్రశాంత్, ఎడ్ల సురేందర్, దామెర విజేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ట భిక్షపతి, దామెర చిన్ని, ఆలేటి గోపాల్, కంజర్ల జాకోబ్ పాల్గొన్నారు.

పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సాధన కమిటీ నాయకులు

పరకాల: జిల్లా కేంద్రం చేయడానికి అర్హత కలిగిన పరకాలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం గుర్తించి తక్షణమే పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో పరకాల ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ) ఉమకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రం చేయకపోవడంతో అభివృద్ధి రంగంలోనే కాకుండా వ్యాపార, వాణిజ్యపరంగా పరకాల చాలా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో పరకాలకు మరింత అన్యాయం జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దుబాసి వెంకటస్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, బీజేపీ కౌన్సిలర్లు ఆర్పీ జయంత్‌లాల్, బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, పరకాల, నడికూడకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నవనాగ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


కలశాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులోని ఓషధీశ్వర మానసాదేవి సహిత నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ వ్యవస్థాపకుడు గంట సీతారామారావు రాధాదేవి ఆధ్వర్యంలో వేదపండితుడు సతీష్ శుక్రవారం కాలసర్ప దోషాలు, నవగ్రహ దోషాలకు ప్రత్యేక పరిహారం, అశ్లేష బలి కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, నవ నాగులకు అభిషేకం నిర్వహించగా, భక్తులు కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పవన్‌శర్మ మాట్లాడుతూ ప్రతినెల అశ్లేష నక్షత్రంలో ఇలాంటి కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అలాగే, అమావాస్య రోజు చండీహోమం, ప్రతి మంగళవారం ఉదయం 6గంటలకు నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు జరుగుతాయని వివరించారు. పూజా కార్యక్రమంలో బొల్లెడ్ల తిరుమల్ రెడ్డి, జలేందర్‌రెడ్డి, గడ్డం రమేష్, తోకల జయపాల్ రెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం


ముల్కనూర్‌లో వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో చెలరేగుతున్న మంటలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో గ్రామంలోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. బస్టాండ్ సమీపంలోని వినాయక విగ్రహాల తయారీ గుడిసె వద్ద ఎదురుగా ఉన్న విద్యుత్ తీగలకు చెట్టుకొమ్మలు తగడంతో నిప్పు రవ్వలు గుడిసెపై పడ్డాయి. దాంతో పీచుగడ్డి అంటుకొని మంటలు చెలరేగి పీఓపీ కూడా మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు కృష్ణంరాజు తెలిపారు.

కమిషనర్‌కు అభినందనల వెల్లువ


కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న శ్రద్ధ శుక్ల

వరంగల్ అర్బన్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధ శుక్ల శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను సీఐటీయూ, టీఎంఆర్పీఎస్, జేఏసీ, టీఎంఈడబ్ల్యూఏ, బీఆర్ఎస్‌యూ నాయకులు వేర్వేరుగా కలిశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.ఉప్పలయ్య, వేల్పుల ధర్మరాజు, సింగారపు బాబు, రాజారపు భాస్కర్, బరుపట్ల మహేష్, పుల్ల దేవేందర్, పాపయ్య, రమేష్, బీఆర్ఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కిషోర్ కుమార్, శనిగరపు శ్యామ్, సుధాకర్, నాగరాజు, కుమ్మరి అశోక్, మోహన్, రవీందర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు. అలాగే, కమిషనర్‌ను అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను భాస్కర్, ప్రతినిధులు హకీమ్ నవీద్, దొమ్మటి ప్రవీణ్ తదితరులు కలిశారు.

హన్మకొండ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను బల్దియా కార్యాలయంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంగవైకల్య రిజర్వేషన్ వర్తింపజేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ, నాయకులు

విద్యారణ్యపురి: క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్ల నియామకాల్లో, బదిలీల్లో అంగవైకల్య రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని వీ – జేఏసీ బాధ్యులు నల్లెల రాజయ్య, బోనగిరి రాములు, ధనుంజయ్ కుమార్, సంగాల శ్రీనివాస్ కోరారు. ఈమేరకు హనుమకొండలో డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఈఓతో కలిసి దివ్యాంగుల అట్రాసిటీ చట్టం పోస్టర్‌ను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు.